

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు. చిత్రంలో రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేశ్, చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత దేవీప్రసాద్

# రేషన్‌కార్డులకూ కోతలు

మొదటిపేజీ తరువాయి...

ఆధారంగా మరింత మందిని తగ్గించాలని ఆదేశాలిచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణభవన్‌లో శనివారం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, రసమయి బాలకిషన్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌తో కలిసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఇదే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ సైతం రాశారు. తమ ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను ఎలా పెంచాలని చూస్తే, కాంగ్రెస్ సర్కారు ఎలా తగ్గించాలని చూస్తున్నదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల్లో మొదటి హామీ మహాలక్ష్మి కింద మహిళలకు రూ.2,500 అమలు కాలేదని, చివరి హామీ చేయూతకు దిక్కు లేదని ఫైరయ్యారు. మధ్యలో ఉన్న అన్ని హామీలదీ దాదాపు అదే దుస్థితి అని, అన్నింట్లో కోతల విధిస్తున్నారని ధ్వజమెత్తారు. దేవుళ్ల మీద ఒట్లు పెట్టి మోసం చేసింది చాలదన్నట్టు.. రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26 రోజున పథకాల ప్రారంభం పేరుతో రాజ్యాంగాన్ని వంచిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలతో ఉన్నారని, రేవంత్‌రెడ్డి పాపం చేస్తే అధికారులకు శాపం తగులుతున్నదని వాపోయారు.

### ఆ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలి

ప్రజాపాలనలో 11 లక్షల మంది, ఆన్‌లైన్‌లో కొన్ని లక్షల మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని వాటిని ఎందుకు పరిశీలించడం లేదని హరీశ్ నిలదీశారు. సిద్దిపేట నియోజకవర్గం నంగునూరు మండలం గట్లమల్యాలలో 110 మంది ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టారని, లిస్టులో 40 మంది పేర్లే వచ్చాయని, అధికారులను అడిగితే హైదరాబాద్ నుంచి పేర్లు వచ్చాయని, తమకేమీ తెల్వదని చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నదని, ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

### బీఆర్‌ఎస్‌పై బురదజల్లే యత్నం

రేషన్‌కార్డుల విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ సర్కారు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నదని హరీశ్ మండిపడ్డారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో 6,47,479 రేషన్ కార్డులు ఇచ్చామని, దీనిద్వారా 20,69,033 మంది లబ్ధిదారులు అదనంగా రేషన్ అందిందని గుర్తుచేశారు. నాటి సీఎం కేసీఆర్ మానవతా దృక్పథంతో నిరుపేదలకు రేషన్‌కార్డులు రావాలనే ఆలోచనతో ఆదాయ పరిమితిని కూడా పెంచారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయ పరిమితి గ్రామీణంలో 60 వేలు, పట్టణంలో 75 వేలు ఉంటే, దాన్ని గ్రామీణంలో రూ.1.50 లక్షలు, పట్టణంలో రూ.2.50 లక్షలకు పెంచారని గుర్తుచేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, జర్నలిస్టులు, ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, పేదవర్గాలకు లాభం జరగాలని ఈ నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. రేషన్‌కార్డు ద్వారా కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి ఇచ్చే బియ్యం 4 కేజీల నుంచి 6 కేజీలకు పెంచామని, కుటుంబానికి 20 కేజీలే ఉన్న పరిమితిని ఎత్తివేసి, ఎంతమంది ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి 6 కిలోల రేషన్ ఇచ్చామని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన ఆరు నెలల్లోనే మధ్యాహ్న భోజనం, గురుకులాలు, హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా చేశామని చెప్పారు. కాంగ్రెస్ అభయహస్తం మ్యానిఫెస్టోలో రేషన్ కార్డులపై సన్నబియ్యం సరఫరా చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి 400 రోజులు గడుస్తున్నా అతీగతీ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### ప్రజల ఆదాయ పరిమితిని పెంచాలి

పదేండ్లలో ద్రవ్యోల్బణం ఏటా సగటున 5.42 శాతం ఉన్నదని, పదేండ్లకు గాను సుమారు 69.60 శాతం ద్రవ్యోల్బణం నమోదైనట్టు ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) సంస్థతోపాటు ప్రపంచబ్యాంకు స్పష్టంచేసిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. దీని ప్రకారం 1.7 రెట్లు ధరల పెరుగుదల నమోదైందని, తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల ఆదాయ పరిమితిని రూ.2.55 లక్షలకు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల ఆదాయ పరిమితిని రూ. 3.40 లక్షలకు పెంచి పేదలందరికీ లబ్ధిచేకూర్చాలని డిమాండ్‌చేశారు. ద్రవ్యోల్బణం లెక్కల ఆధారంగా పరిగణించి రేషన్‌కార్డులు ఇస్తే ఎంతో మంది నిరుపేదలు రేషన్ కార్డులు పొందుతారని తెలిపారు. 2014లో అంగన్‌వాడీల వేతనం రూ.4,200 ఉండేదని, కేసీఆర్ ప్రభుత్వం మూడు దఫాలుగా పెంచి వారి వేతనాన్ని రూ.13,650కి పెంచిందని, 2014లో వీరి వార్షికాదాయం రూ.50,400 ఉండగా, పెరిగిన వేతనం ప్రకారం ఇప్పుడు వార్షికాదాయం రూ.1,63,800 అని, రేషన్ కార్డుల జారీలో 2014 నిబంధనలను అనుసరిస్తే రాష్ట్రంలో ఏ ఒక్క అంగన్‌వాడీ టీచర్‌కు రేషన్‌కార్డు రాదని, ఆశాలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, చిరుద్యోగులకు ప్రభుత్వ అశాస్త్రీయ నిబంధనల వల్ల రేషన్ కార్డులు రాని దుస్థితి నెలకొన్నదని మండిపడ్డారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆదాయ పరిమితిని పెంచి పేదలకు లాభం చేయాలని డిమాండ్ చేశారు. 28వ తేదీ నుంచి గ్రామ సభల్లో రేషన్ కార్డుల గురించి ప్రశ్నించి ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అర్హులకు వచ్చే దాకా బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు. షరతులు లేకుండా మీ సేవ, ప్రజాపాలన, కుటుంబ సర్వేలో కూడా ఇచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొని అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

> పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో 6,47,479 రేషన్ కార్డులు ఇచ్చినం. దీనివల్ల 20,69,033 మంది లబ్ధిదారులు అదనంగా రేషన్ పొందిండ్రు. కేసీఆర్ మానవతా దృక్పథంతో నిరుపేదలకు రేషన్‌కార్డులు రావాలన్న ఆలోచనతో ఆదాయ పరిమితిని కూడా పెంచిండ్రు. ఎక్కువ మందికి రేషన్‌కార్డులు ఇవ్వాలనే ఆలోచన మేముచేస్తే.. ఎక్కువ మందికి కోత పెట్టే ఆలోచన రేవంత్‌రెడ్డి చేస్తున్నడు.
> - హరీశ్‌రావు

### వ్యవసాయ కూలీలకు భరోసాలో కోతలు

ఎన్నికల మ్యానిఫెస్టోలో వ్యవసాయ కూలీలందరికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఉపాధి హామీ జాబ్‌కార్డుకు లింకు పెడుతున్నారని, నాడు ఎందుకు ఇదంతా చెప్పలేదని హరీశ్ నిలదీశారు. కూలీలు గ్రామాల్లో ఉంటే, గ్రామంలో దరఖాస్తులే తీసుకోలేదని, సెక్రటేరియట్‌లో కంప్యూటర్‌లో ఉన్న డాటా ఆధారంగా రైతులను ఎంపిక చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉపాధి హామీ జాబ్ కార్డులు 52 లక్షలు (కుటుంబాలు) ఉంటే, 1.4కోట్ల మంది కూలీలు ఉన్నారని, 20 రోజుల పనిదినాల నిబంధనలు పెట్టి, అర్హులను 25 లక్షలకు కుదించారని, గుంట భూమి ఉన్నా ఇచ్చేది లేదనే ఆంక్ష పెట్టి అర్హుల సంఖ్యను 6 లక్షలకు కుదించారని మండిపడ్డారు. కోటి మందికిపైగా రైతు కూలీలు ఉంటే, ఆరు లక్షల మందికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామనడం ఏం న్యాయమని నిలదీశారు. వ్యవసాయ కూలీలను నిర్ణయించాల్సింది గ్రామాల్లోనని, ఎవరు కూలికి పోతున్నరో అడగాలిగాని, కంప్యూటర్ డేటా ఆధారంగా కోతలు విధించడం దుర్మార్గమని మండిపడ్డారు. 94 శాతం మందికి ఎగ్గొట్టి, 6 శాతం మందికి చేస్తున్నం అంటే ఎగ్గొడుతున్నట్టే కదా? అని ప్రశించారు. 'ఎస్సీ, ఎస్టీ, బీసీల్లోనే ఎక్కువ మంది రైతు కూలీలు ఉంటరు. వాళ్ల నోట్లో మట్టి కొట్టడానికి నీకు చేతులెట్ల వచ్చినయి రేవంత్‌రెడ్డీ?' అని నిలదీశారు. సెంటు భూమి ఉన్నా కూలీలకు భరోసా ఇవ్వమని చెప్పడం తగదని, మీరిచ్చే భరోసా ద్వారా 750 వస్తదని, ఏటా ఇచ్చే రూ.12 వేలు ఎగ్గొడుతామంటే ఎట్లా? అని ప్రశ్నించారు. ఎకరంలోపు ఉన్న వారికి కూడా ఆత్మీయ భరోసా ఇవ్వాలని, హమాలీలతో పాటు పట్టణ కూలీలకు కూడా ఆత్మీయ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలివ్వాలి

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు ముందే ఇవ్వాలని హరీశ్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీల్లో పేదలే ఎక్కువగా ఉంటారు కాబట్టి పునాది వేయడానికి ముందే కిస్తీ డబ్బులు చెల్లించాలని, అప్పుడు వారు బేస్‌మెంట్ వేసుకొనే ఆవకాశం ఉంటుందని చెప్పారు. తెలంగాణలో అన్ని హామీలు అమలు చేసినమని రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పోయి గొప్పలు చెప్తున్నారని, మొదటి గ్యారెంటీ మహాలక్ష్మి నుంచి చివరిదైన చేయూత దాకా ఎగ్గొట్టాడని విమర్శించారు. ఢిల్లీ ప్రజలు అమాయకులు కాదని, కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. అమలును వాయిదా వేసుకొనైనా అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే నిరసనలు తప్పవని, ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు హరీశ్ పిలుపునిచ్చారు.

> ప్రజాపాలనలో 11 లక్షల మంది, ఆన్‌లైన్ ద్వారా కొన్ని లక్షల మంది రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులను ఎందుకు పరిశీలించరు? కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన లిస్టునే ప్రింట్లు తీసి గ్రామాలకు పంపిండ్రు. ఆ సర్వే చేసేటప్పుడు ఇది ఆప్షనల్, బలవంతం లేదు.. ఇష్టమున్న వారే పాల్గొనాలని చెప్పి ఇప్పుడు అర్హులకు రేషన్‌కార్డులు రాకుండా కోతలు పెట్టడం ఎంతవరకు సమంజసం?
> - హరీశ్‌రావు



వేతన బకాయిలు చెల్లించాలంటూ కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖాన శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది నిరసన, మద్దతు తెలిపిన యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్

## పోజులు మాని టైంకు వేతనాలివ్వు

**ఇక్కడ జీతాలందక చిరుద్యోగులు రోడ్డెక్కుతున్నరు • నిప్పులు చెరిగిన హరీశ్‌రావు**

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసామని ఢిల్లీకి వెళ్లి అబద్ధాలు చెప్తున్న రేవంత్‌రెడ్డి పాలనలో ఉద్యోగులు వేతనాలు అందక రోడ్డెక్కే దుస్థితి నెలకొన్నదని ఎక్స్ వేదిగా హరీశ్ విమర్శించారు. ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డికి చిరుద్యోగుల కష్టాలు కనిపించకపోవడం దురదృష్టకరమని ధ్వజమెత్తారు. నాలుగు నెలలుగా పంచాయతీ కార్మికులు, మూడు నెలలుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బంది, నెల గడిచినా మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు వేతనాలందక నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓలు వేలాది మంది చిరుద్యోగులు జీతాలివ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకున్న దయనీయ పరిస్థితి నెలకొన్నదని వాపోయారు. దాదాపు అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నెలలు గడిచినా వేతనాలు రాక కుటుంబ పోషణ భారమై, అప్పుల పాలవుతున్నారని, వేతనాల కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారని తెలిపారు. కుర్చీ కాపాడుకోవడం కోసం ఢిల్లీకి చక్కర్లు కొట్టడం, విదేశాలకు వెళ్లి వేల కోట్ల పెట్టుబడులు తెస్తున్నామనే డబ్బా కొట్టుకోవడం మానేసి పాలనపై దృష్టి సారించాలని హితవుపలికారు. ఇప్పటికైనా చిరుద్యోగులందరికీ సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## రైతు కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

**ఆదిలాబాద్** జిల్లా బేల మండలం సైదాపూర్‌లో గిరిజన రైతు జాదవ్ దేవరావును బ్యాంకు వాళ్లు అప్పుకట్టాలని వేధిస్తే ఆయన బ్యాంకులోనే పురుగుల మందు తాగి చనిపోయారని హరీశ్ ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి సర్కారు చెప్పినట్టుగా డిసెంబర్ 9వ తేదీనే రుణమాఫీ చేసి ఉంటే ఈ రైతు ఆత్మహత్య చేసుకొనే పరిస్థితి వచ్చేది కాదని, ఈ రైతును చంపింది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వమేనని మండిపడ్డారు. రుణమాఫీ విషయంలో రేవంత్ మోసం వల్లే రైతు చనిపోయాడని ఆవేదన వ్యక్తంచేశారు. రుణమాఫీ, రైతుభరోసా, బోనస్ ఇలా అన్ని విషయాల్లో రైతులను రేవంత్‌రెడ్డి మోసం చేశారని విమర్శించారు. ఇప్పుడు రేషన్‌కార్డులు ఇవ్వకుండా పేదల ఉసురు పోసుకుంటున్నారని మండిపడ్డారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ తరఫున రైతు కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## లోకం పోకడ




లంచం ఎందుకు తీసుకున్నావ్ అని ఎన్నిసార్లు అడిగినా చెవులు వినబడడం లేదంటున్నాడు సార్!

## నిలదీసిన హరీశ్.. కదిలిన సర్కార్

**హుటాహుటిన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల వీడియో కాన్ఫరెన్స్**
**రేషన్‌కార్డుల జారీపై కలెక్టర్లకు కొత్త మార్గదర్శకాలు**
**కులసర్వేనే ప్రామాణికం కాదని వివరణ**
**21 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని వెల్లడి**

హైదరాబాద్, జనవరి18 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి హరీశ్‌రావు నిర్వహించిన ప్రెస్‌మీట్‌తో ప్రభుత్వం ఉలిక్కిపడింది. హుటాహుటిన ముగ్గురు మంత్రులు కలెక్టర్లతో రేషన్‌కార్డుల జారీపై సమీక్షించడమే కాకుండా అప్పటికప్పుడు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. కులసర్వే మాత్రమే ప్రామాణికం కాదంటూ దిద్దుబాటు చర్యలకు దిగింది. మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించింది. రేషన్‌కార్డుల జారీకి ఇటీవల మార్గదర్శకాలు జారీచేసిన ప్రభుత్వం.. కొత్తగా దరఖాస్తులు స్వీకరించబోమని తెలిపింది. కుల సర్వే ఆధారంగా రూపొందించిన జాబితాలో ఉన్న అర్హులైన కుటుంబాలకే రేషన్‌కార్డులను మంజూరు చేస్తామని ప్రకటించింది. ఆ మేరకు గ్రామాల్లో ఇప్పటికే సర్వేను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఇదే అంశంపై శనివారం ప్రత్యేకంగా ప్రెస్‌మీట్ నిర్వహించి ప్రభుత్వ విధానాన్ని తూర్పారబట్టారు. కొత్తగా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ రేషన్‌కార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. సచివాలయం నుంచి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డ్‌లను జారీ చేయాలని కలెక్టర్లకు సూచించారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ప్రకటించారు. హరీశ్‌రావు లేవనెత్తిన అంశాలకు వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభల్లో దరఖాస్తులను స్వీకరించడంతోపాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని కలెక్టర్లకు స్పష్టంచేశారు. కులగణన (సామాజిక) సర్వేనే కార్డుల జారీకి ప్రామాణికం కాదని, అదే తుది జాబితా కాదని తెలిపారు. ప్రజాభిప్రాయం తీసుకోవడంతోపాటు గ్రామసభలు, ప్రజాపాలన సేవాకేంద్రాల్లో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, ఎంపీడీవో కార్యాలయంలో ఇప్పటికే ఉన్న దరఖాస్తులను పరిశీలించిన తర్వాత మాత్రమే అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటిస్తామని మంత్రులు స్పష్టంచేశారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంటి స్థలమున్న వారి, స్థలం లేనివారి జాబితాలను గ్రామసభల్లో ప్రదర్శించాలని సూచించారు. వ్యవసాయయోగ్యమైన ప్రతి భూమికీ రైతు భరోసా కల్పించాలని, వ్యవసాయ, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్ధిదారులను గుర్తించాలని, ఉపాధిహామీ పథకంలో కనీసం 20 రోజులపాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, అదీ మహిళల బ్యాంకు ఖాతాలకే వర్తింపజేస్తామని తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో 156 గ్రామాలను మున్సిపాలిటీల్లో కలపడం జరిగిందని, ఆ గ్రామాల్లో 2023 –24 లో జరిగిన ఉపాధి హామీ పనుల జాబితాను పరిగణనలోనికి తీసుకుంటామని స్పష్టంచేశారు. గ్రామసభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. సమావేశంలో సీఎస్ శాంతికుమారి కూడా పాల్గొన్నారు.



## నేలకొరిగిన బడే చొక్కారావు?

మొదటిపేజీ తరువాయి...

వరంగల్ (కేకేడబ్ల్యూ) కార్యదర్శిగా, ఉత్తర తెలంగాణ డివిజన్ కమిటీ కార్యదర్శిగా పనిచేశాడు. ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్ పేల్చిన ఘటనలో దామోదర్ ప్రధాన పాత్ర పోషించారు. ఉద్యమ బాట పట్టి 27 ఏండ్లపాటు సుదీర్ఘంగా భూస్వామ్య, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆయుధం పట్టిన చొక్కారావు.. వెనుదిరిగి చూడలేదు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ 2021లో అనారోగ్యంతో మృతిచెందారు. ఆ తర్వాత చొక్కారావును తెలంగాణ ప్రాంతానికి ఇన్‌చార్జిగా కేంద్ర కమిటీ నియమించింది. చొక్కారావు పేరున ఛత్తీస్‌గఢ్‌లో రూ.50 లక్షలు, తెలంగాణలో రూ.25 లక్షల చొప్పున రివార్డులు ఉన్నాయి. చొక్కారావు మృతిచెందాడని మావోలు లేఖ విడుదల చేయగా, ఆయన మృతిని బస్తర్ ఐజీ ధృవీకరించలేదు.

## గ్రామసభకు ముందే అర్హులను తేల్చేశారు!

- వారం క్రితమే అధికారులకు అందిన జాబితా
- తమ పేర్లు లేవంటూ దరఖాస్తుదారుల ఆందోళనలు
- దిల్‌సుఖ్‌నగర్ ఏరియా వార్డులో సుమారు 10వేల మంది అర్హులుంటే.. జాబితాలో 144 పేర్లే
- పాతకార్డుల్లో మార్పులు, చేర్పులకు నో చాన్స్
- సర్కార్ చెప్తున్నదొకటి.. చేస్తున్నదొకటి



హైదరాబాద్, జనవరి 18(నమస్తే తెలంగాణ): కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ గందరగోళంగా మారింది. ఏ విధానంలో అర్హులను ఎంపిక చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొన్నది. సర్వే చేసి, గ్రామసభల్లో చర్చించిన తర్వాతే అర్హులను ఎంపిక చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనలు అంతా ఉత్తవేనని తేలిపోయింది. గ్రామసభల నిర్వహణకు ముందే అర్హుల జాబితాను ప్రభుత్వం ఫైనల్ చేసింది. ఇప్పటికే ఆ జాబితాను క్షేత్రస్థాయి అధికారులకు అందజేసింది. దీనినే మొక్కుబడిగా గ్రామసభల్లో పెట్టి మమ అనిపించేందుకు రంగంసిద్ధమైంది. కులగణన సర్వే ఆధారంగా కొత్త రేషన్‌కార్డులకు అర్హులను గుర్తిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇప్పటివరకు ఈ సర్వే పూర్తి కాలేదు. స్పష్టత లేని సర్వే ఆధారంగా అర్హులను ఏవిధంగా గుర్తిస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### వారం ముందే అధికారులకు జాబితా

కొత్త రేషన్‌కార్డు పొందేందుకు అర్హుల జాబితాను ప్రభుత్వం వారం క్రితమే క్షేత్రస్థాయి అధికారులకు అందజేసింది. ఈ జాబితాను దేని ఆధారంగా, ఏ విధంగా రూపొందించారనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం. ఈ జాబితానే ఫైనల్ అనే ప్రచారం జరుగుతున్నది. దీంతో భారీ సంఖ్యలో అర్హులకు రేషన్‌కార్డుల జారీలో కోత తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిరుడు డిసెంబర్‌లో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో కొత్త రేషన్‌కార్డుల కోసం సుమారు 10 లక్షల దరఖాస్తులు, పాత కార్డుల్లో మార్పులు, చేర్పులకు మరో 10 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అంటే మొత్తం 20 లక్షల దరఖాస్తులున్నాయి. అయితే, ప్రభుత్వం 5–6 లక్షల కొత్త కార్డులు మాత్రమే ఇచ్చేందుకు రంగం సిద్ధంచేసినట్టు తెలిసింది. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ఏరియాలో ఒక వార్డులో సుమారు 10 వేల మంది కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం పంపించిన జాబితాలో 140 మంది పేర్లు మాత్రమే ఉన్నట్టు తెలిసింది. ఈ విధంగా అన్నిచోట్లా భారీ సంఖ్యలో కోతలు ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### జాబితాలో మా పేర్లేవి?

ప్రభుత్వం పంపించిన అర్హుల జాబితా గ్రామాలకు చేరడంతో దానిని చూసిన ప్రజలు షాక్ అవుతున్నారు. రేషన్‌కార్డు పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను నిలదీస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి.

### చేరికలు, తీసివేతలు లేనట్టేనా?

కొత్త రేషన్‌కార్డులు ఇస్తామంటున్న సర్కారు... పాత కార్డుల్లో కుటుంబసభ్యుల చేరిక, పేర్ల తీసివేతలపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో మరింత గందరగోళం నెలకొన్నది. కొత్తగా పెండ్లి అయిన వారు, వేరుపడిన వారు సుమారు 10 లక్షల మంది చేరికలు, తీసివేతలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నారు. ఒకవేళ పాత కార్డులో పేరుంటే అందులో వారి పేరు తొలగించకుండా కొత్త కార్డు రాదు. దీంతో అర్హులైనప్పటికీ వారికి కొత్త కార్డు మంజూరు కాదు. కొత్తగా పెండ్లి అయనవారు తమ పిల్లల పేర్లను రేషన్‌కార్డులో చేర్చాలన్నా వీలుకాని పరిస్థితి నెలకొన్నది.

## హరీశ్ పోరాటం... పొలాల్లో జలప్రవాహం

- మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ నీటి విడుదల చేసిన మంత్రి సురేఖ
- కాళేశ్వరం కూలిపోతే ఈ నీళ్లు ఎక్కడివి?: కొత్త ప్రభాకర్‌రెడ్డి



సిద్దిపేట జిల్లా తుక్కాపూర్ పంపుహౌస్ వద్ద గోదావరి జలాలకు పూజలు చేసి పూలు చల్లుతున్న మంత్రి కొండా సురేఖ, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సిద్దిపేట, జనవరి 18 (నమస్తే తెలంగాణ)/తొగుట: రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ నుంచి నీటిని విడుదల చేసింది. శనివారం సిద్దిపేట జిల్లా తుక్కాపూర్ పంపుహౌస్ వద్ద రంగనాయకసాగర్‌లో పూజలు చేసిన అనంతరం దేవాదాయశాఖమంత్రి కొండా సురేఖ నీటిని విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రంగనాయకసాగర్ సామర్థ్యం 3 టీఎంసీలు, ప్రస్తుత నీటి నిల్వ 2.44 టీఎంసీలు అని తెలిపారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్లలోని పూర్తి ఆయకట్టు 1.10లక్షల ఎకరాలు అని చెప్పారు. ఈ నీటి విడుదలతో 166 చెక్‌డ్యామ్‌లు నింపేందుకు వీలు కలుగుతుందని వివరించారు.

### బీఆర్‌ఎస్ పోరాటం.. పొలాలు సశ్యశ్యామలం

రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ నీటి విడుదలతో యాసంగికి సాగునీరు అందనున్నది. రైతాంగానికి సాగునీరు విడుదల చేయాలని భారీ నీటి పారుదలశాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిసెంబర్ 4న లేఖ రాశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి నీటి విడుదలకు చొరవ చూపారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కాల్వల వెంట పర్యటిస్తూ రైతులకు నీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోరాటం ఫలించి, కాళేశ్వరజాలలు విడుదలయ్యాయని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో ఆందోళనకు దిగితే తప్ప నీటిని విడుదల చేయడంలేదని మండిపడుతున్నారు.

### కాంగ్రెస్ నేతలు ఇప్పుడేమంటారు!

సామాజిక మాధ్యమాల్లో, రాజకీయవర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు అందడం లేదని గతంలో కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే పాటపాడారు. కానీ ఇప్పుడు మంత్రి కొండా సురేఖ నీటి విడుదల చేశారని, కాంగ్రెస్ నేతలు ఇప్పుడేమంటారని బీఆర్‌ఎస్ శ్రేణులు, తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు.

### కేసీఆర్ కృషితోనే ప్రాజెక్టుల నిర్మాణం

"మల్లన్నసాగర్ ప్రాజెక్టు వద్దంటూ అడ్డుకున్న నేతలే నేడు గోదారమ్మకు హారతులు పడుతున్నారు. తెలంగాణ వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయని ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చెప్పారు. తొలి సీఎంగా ఆచరణలో చేసి చూపించారు. కేసీఆర్ కృషితో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందాయి. కాళేశ్వరం కూలి పోయిందని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేశారు. నేడు విడుదల చేసిన గోదావరి జలాలు కాళేశ్వరం నుంచి వచ్చినవి కావా? ప్రభుత్వం కూడవెల్లివాగు, రామాయంపేట, చిన్న శంకరంపేట కాలువలకు నీళ్లు విడుదల చేయాలి.

-కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే

## తప్పులతడకగా రేషన్ కార్డుల జాబితా

**అర్హుల పేర్లు గల్లంతుపై గ్రామస్తుల నిలదీత**

రుద్రూర్, జనవరి 18: రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే తీరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం నిజామాబాద్ జిల్లా సులేమాన్‌నగర్‌లో రేషన్ కార్డుల సర్వేపై స్థానికులు అధికారులను నిలదీశారు. సర్వేను సక్రమంగా నిర్వహించడంలేదని పంచాయతీ కార్యదర్శిపై మండిపడ్డారు. ఎన్నో ఏండ్లుగా గ్రామంలో నివాసముంటున్న తమ పేర్లు జాబితాలో లేవని, సర్వే సక్రమంగా చేయాలని డిమాండ్ చేశారు.

## రేషన్ కార్డుల కోసం రీసర్వే

**భీమారంలో ఆందోళన నేపథ్యంలో దిగివచ్చిన అధికారులు**

భీమారం, జనవరి 18 : 'మాకు రేషన్ బియ్యం వస్తలేవు. లిస్టులో 182 మంది పేర్లు వచ్చాయి. అందులో కొంతమంది రిటైర్డ్ సింగరేణి కార్మికులు ఉన్నారు. ఏ ప్రాతిపదికన లిస్టు రూపొందించారు. అర్హులకు అన్యాయం చేస్తే ఊరుకోం. గ్రామసభ రోజు ఎంపీడీవో, తహసీల్దార్‌ను నిర్బంధిస్తాం.' అంటూ శుక్రవారం మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రానికి చెందిన యువకులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో శనివారం పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తితో పాటు సిబ్బంది 4 టీంలుగా ఏర్పడి మండల కేంద్రంలో మరోసారి సర్వే నిర్వహించారు. ఇప్పటికే రేషన్ కార్డు లిస్ట్ విడుదల చేయగా, మరోసారి సర్వే ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రేషన్ కార్డు లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 21న గ్రామ సభ ఉండగా అడ్డుకోకుండా ఉండేందుకు తాత్కాలిక సర్వేను చేపడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీడీవో మధుసూదన్, తహసీల్దార్ సదానందం, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి నుంచి ఎలాంటి స్పందన లేదు. ఎమ్మెల్యే వివేక్, మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కుమార్ దీపక్‌తో మాట్లాడి సర్వే కోసం అనుమతులు తీసుకున్నట్టు కాంగ్రెస్ జిల్లా నేత సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు.